సాక్షి
అనంతపురం
మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.15, సరాసరి రూ.17 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
35.9°/21.6°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు బాబూ?

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూటి ప్రశ్న



అనంతపురం కార్పొరేషన్: 'ఎన్నికల ముందు చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రజలకు ఏదేదో చేసేస్తాం అంటూ నమ్మబలికారు. సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక తూతూమంత్రంగా కొన్ని పథకాలు అమలు చేశారు. ఇప్పుడేమో అన్నీ అమలు చేసినట్లు సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అంటూ సభ ఏర్పాటు చేస్తున్నారు. అసలు చంద్రబాబు ఏ ముఖం పెట్టుకుని జిల్లాకు వస్తున్నారో అర్థం కావడం లేదు' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 10న జిల్లా కేంద్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంపై విమర్శలు గుప్పించారు. చంద్రబాబుకు అసలు సిగ్గుందా? అని ప్రశ్నించారు. ఆయన రాజకీయ జీవితమంతా వచ్చి అబద్ధాలేనన్నారు. 'సూపర్ సిక్స్'లో మొదటి హామీ అయిన నిరుద్యోగ భృతికే దిక్కు లేదన్నారు. ఇంట్లోని ప్రతి పిల్లాడికీ 'తల్లికి వందనం' అందిస్తామని చెప్పి అర్హులకు అన్యాయం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం రైతుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. జిల్లాలో 2.75 లక్షల మందికి 'అన్నదాత సుఖీభవ' ఇచ్చినట్లు అధికారులు లెక్కల్లో చూపుతున్నారని, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఇంకా 30 వేల మందికి నగదు అందలేదని వివరించారు. ఇంతకన్నా దారుణం ఎక్కడా ఉండదన్నారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించేసి రైతులను రోడ్డెక్కే పరిస్థితికి తీసుకువచ్చారని దుయ్యబట్టారు. ఏటా మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పి కేవలం రెండు సిలిండర్లతో సరిపెట్టారన్నారు. వందకుపైగా హామీలను నెరవేర్చలేదన్నారు. గోరంత చేసి కొండంత ప్రచారం చేసుకోవడం చంద్రబాబుకు పరిపాటిగా మారిందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు.

వినతుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. మొత్తం 410 అర్జీలు అందాయి. డీఆర్‌ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు.

వినతుల్లో కొన్ని...

- వైకల్యం తక్కువగా ఉందంటూ పింఛను తొలగించారని రాయదుర్గం పట్టణం పాపట్ల బావి వీధికి చెందిన జి.బసవరాజు విన్నవించాడు. ఏళ్లుగా అందుతున్న పింఛన్ నిలిపేయడంతో ఇబ్బందులు పడుతున్నానని, రీ వెరిఫికేషన్ చేసి న్యాయం చేయాలన్నాడు.
- ఇల్లు బాగుందంటూ 2023 నుంచి వస్తున్న వృద్ధాప్య పింఛను తొలగించారని అనంతపురం రూరల్ మండలం రుద్రంపేటకు చెందిన నారాయణస్వామి వాపోయాడు. పునరుద్ధరించాలని వేడుకున్నాడు.
- డీడీ చెల్లించి ఐదు నెలలవుతున్నా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయలేదని రాప్తాడు మండలం మరూర్ చెర్లోపల్లికి చెందిన దివ్యాంగుడు నాగేంద్ర వాపోయాడు. ఈ ఏడాది మే 2న రూ.24 వేలు డీడీ చెల్లించానని, పదేపదే తిరగలేనని విన్నవించినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందాడు.

జిల్లాకు 871 మెట్రిక్ టన్నుల యూరియా



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాకు 871 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. కోరమాండల్ కంపెనీ నుంచి 601 మెట్రిక్ టన్నులు, పారాదీప్ ఫాస్పేట్ కంపెనీ నుంచి 270 మెట్రిక్ టన్నులు జిల్లాకు చేరిందన్నారు. ఇందులో మార్క్‌ఫెడ్‌కు 530 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 341 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు. జేసీ ఆదేశాల మేరకు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

పాలకా.. తగునా వేడుక

రైతులు వీధుల్లో.. మంత్రులు ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లలో..

- యూరియా కోసం రైతుల పడిగాపులు
- ఒక్క బస్తా కోసం రాత్రంతా జాగరణ
- నగం కేబినెట్ వారం రోజులుగా అనంతలోనే మకాం
- చంద్రబాబు సభ ఏర్పాట్లలో నిమగ్నం
- అధికారులు సైతం ఏర్పాట్లలో మునిగి తేలుతున్న వైనం
- మా బాధలు మీకు పట్టవా అంటూ మంత్రులపై రైతుల ఆగ్రహం



కణేకల్లు వ్యవసాయ కార్యాలయం వద్ద యూరియా కోసం గుమిగూడిన రైతులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో రైతులు యూరియా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఒక్క బస్తా యూరియా దొరికినా చాలు అంటూ తెల్లార్లూ జాగారం చేస్తున్న పరిస్థితి. ఏ ఊరికెళ్లినా యూరియా కోసం బారులు తీరిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. రైతన్నల ఇబ్బందులపై సామాజిక మాధ్యమాల్లోనూ శరపరంపరగా పోస్టులు కన్పిస్తున్నాయి. సర్కారు తీరుపై సామాన్యులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇంత జరుగుతున్నా దగ్గరుండి రైతుల కష్టాలు తీర్చాల్సిన మంత్రులు అసలు ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. 'మీరు ఏం చావు చస్తే మాకేమిటీ' అన్నట్టు వ్యవహరిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం సభ ఏర్పాట్లలో ఉండగా.. అధికారులు కూడా రైతుల సమస్యలు గాలికొదిలి సీఎం సభ కోసమే పనిచేస్తున్నారు.

నగం కేబినెట్ అనంతపురంలోనే..

రాష్ట్రంలో ఒక జిల్లాలోనో, ఒక నియోజకవర్గంలోనో కాదు ఊరూరా యూరియా కష్టాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వారికి అండగా నిలవాల్సిన మంత్రులకు, ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సభ ఏర్పాట్లే ముఖ్యమయ్యాయని సామాన్యులు వాపోతున్నారు. ఈ నెల 10న 'సూపర్ సిక్స్-సూపర్‌హిట్' అనే కార్యక్రమాన్ని అనంతపురంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం 10 మంది మంత్రులు వారం రోజులుగా ఇక్కడే ఉన్నారు. సీఎంతో పాటు పవన్‌కల్యాణ్, లోకేష్ సభకు వస్తున్నారని, అట్టహాసంగా చేయాలన్న ఆలోచనతో మంత్రులు ఈ ఏర్పాట్లలోనే నిమగ్నమయ్యారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, రాంప్రసాద్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ తదితరులంతా ఇక్కడే ఉన్నారు.



సీఎం సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు

నేడు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా రానున్నారు. ఇక రాయలసీమ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ఎమ్మెల్యేలు కూడా రైతుల సమస్యలు గాలికొదిలి అనంతపురంలో మకాం వేశారు.

నియోజకవర్గాల్లో ఒక్కరూ లేరు..

ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలంతా సీఎం సభ ఏర్పాట్లలోనే తరిస్తున్నారు. రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో గడిచిన పక్షం రోజులుగా ఇక్కడ యూరియా లేదు. కానీ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అనంతపురం వదిలి అక్కడికి వెళ్లడం లేదు. మడకశిర నియోజకవర్గంలో రెండ్రోజుల క్రితం తాగునీరు లేక ప్రజలు రోడ్డెక్కారు. కానీ ఆ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాత్రం అనంతపురంలోనే ఉన్నారు. ఉరవకొండ, కళ్యాణదుర్గం, పుట్టపర్తి, రాప్తాడు..ఇలా అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలూ సీఎం సభ కోసమే పనిచేస్తున్నారు. సభ సందర్భంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం కోసం ఒకర్ని మించి ఒకరు పోటీపడుతున్నారు. వీరి తీరును రైతులు, ప్రజలు ఏవగించుకుంటున్నారు.

పెద్ద ఎత్తున పక్కదారి

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాకు చేరిన యూరియాలో పెద్దఎత్తున పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతల దన్నుతో అక్రమార్కులు జిల్లా, రాష్ట్ర సరిహద్దులు దాటించినా అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా యూరియా కోసం రైతులు రోడ్డెక్కిన తర్వాతే కూటమి సర్కారులో చలనం వచ్చింది. హడావుడిగా విజిలెన్స్, వ్యవసాయ, మార్క్‌ఫెడ్, పోలీసు శాఖలను అప్రమత్తం చేసింది. పది రోజులుగా జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నా పెద్దగా ఫలితం లేదు. 77 షాపుల్లో తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 260 మెట్రిక్ టన్నుల యూరియాకు కేవలం స్టాప్ సేల్స్ ఇచ్చారు. యూరియా విషయంలో సర్కారు కాకిలెక్కలతో బురిడీ కొట్టించే ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఖరీఫ్‌లో జిల్లాకు 26,839 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ప్రణాళిక రూపొందించారు. ఇప్పటి వరకు 16,955 మెట్రిక్ టన్నులే చేరింది. ఈ నెలాఖరులోపు ఇంకా 10 వేల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. అయితే, అది రెండు వేల మెట్రిక్ టన్నులకు మించకపోవచ్చని అధికార వర్గాలే చెబుతున్నాయి. గత ఖరీఫ్ మిగులు, ఈ ఏడాది జిల్లాకు చేరిన యూరియా కలిపి ఇప్పటి వరకు 30 వేల మెట్రిక్ టన్నులు పంపిణీ చేసినట్లు అధికారులు చెబుతున్నా.. వాటికి కచ్చితమైన లెక్కలు మాత్రం చూపడం లేదు.

పడిగాపులు.. నిలదీతలు.. వాగ్వాదాలు



కూడేరు: యూరియా కోసం అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు



యల్లనూరు సొసైటీ వద్ద యూరియా కోసం గుమిగూడిన రైతులు

కూడేరు/కణేకల్లు/యల్లనూరు: యూరియా కోసం రైతులకు పడిగాపులు తప్పడం లేదు. గంటల తరబడి వేచి ఉన్నా తగినంత యూరియా కూడా దొరక్కపోవడంతో కడుపు మండిన అన్నదాతలు అధికారులను నిలదీస్తున్నారు.

- కణేకల్లులో యూరియా వచ్చిందన్న సమాచారంతో రైతులు సోమవారం ఉదయం 7 గంటలకే ఏఓ కార్యాలయం వద్ద బారులు తీరారు. క్యూలో నిల్చొని టోకెన్లు తీసుకున్నారు. 11 గంటల తర్వాత ఎండతీవ్రత ఎక్కువ కావడంతో నిల్చునే ఓపిక లేక పాసుపుస్తకాలు, బ్యాగులను వరుసలో పెట్టి చెట్ల కిందకు చేరుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో 'నేను ముందు.. కాదు నేనే ముందు' అంటూ పలువురు రైతులు కౌంటర్ వద్ద పరస్పరం గొడవకు దిగారు. అయితే, ఎంత సేపు వేచి ఉన్నా ఒక్కో రైతుకు 2 బస్తాలే ఇవ్వడంతో ఆవేదన వ్యక్తం చేశారు.
- కూడేరులోని వ్యవసాయ గోదాము వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. అయితే, స్టాక్ తక్కువ ఉంది.. ఒక్కో రైతుకు ఒక బస్తానే ఇస్తామని ఏఓ శుభకర్ చెప్పడంతో కడుపు మండిన రైతులు రెండు బస్తాలివ్వాలంటూ ఆయనతో వాగ్వాదానికి దిగారు.
- యల్లనూరు మండలం పెద్దమల్లేపల్లి సచివాలయానికి యూరియా రాకపోవడంతో రైతులు సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ వద్ద ధర్నాకు సిద్ధమయ్యారు. ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి మధుకుమార్ రైతులతో ఫోన్లో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. మంగళవారం సాయంత్రానికి లోడు వస్తుందని చెప్పడంతో రైతులు శాంతించారు.

10 ఎకరాలకు 2 బస్తాలేనా?



10 ఎకరాల్లో వరి సాగు చేశా. యూరియా కోసం మూడు నెలల నుంచి ఎదురు చూస్తున్నా. ఈ రోజు 2 బస్తాల యూరియాకు టోకెన్ ఇచ్చారు. 10 ఎకరాలకు రెండు బస్తాలిస్తే ఎలా సరిపోతాయి. లోడ్లకు లోడ్లు యూరియా వస్తుందని అంటున్నా ఎక్కడికి పోతోందో ఏమో?

– దాదాపీర్, రైతు, కణేకల్లు

ఎప్పుడూ ఇలా లేదు..



జగనన్న ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క రైతు యూరియా కోసం కష్టపడలేదు. కరోనా లాక్‌డౌన్ సమయంలో కూడా సరఫరా చేశారు. ఇప్పుడేమో యూరియా కొరతతో సతమతమవుతున్నాం. పనులన్నీ మానుకొని నెల రోజుల నుంచి తిరుగుతున్నా యూరియా మాత్రం దొరకడం లేదు.

– చంద్ర, మారెంపల్లి, కణేకల్లు మండలం

రైతులను గాలికి వదిలేశారు



పంటల సాగు కోసం అప్పులు చేశాం. సకాలంలో యూరియా వేయకపోతే మొక్క ఎదుగుదల తగ్గి నష్టపోవాల్సి వస్తుంది. నేడు, రేపు వస్తుందని అధికారులు చెబుతున్నారు. సంబరాలు జరుపుకుంటున్న ప్రజాప్రతినిధులకు యూరియా అందక అల్లాడిపోతున్న రైతులు కనపడటం లేదు.

– లక్ష్మీనారాయణ, రైతు, హరేసముద్రం, బొమ్మనహాళ్ మండలం

చిత్తశుద్ధి లేని ప్రభుత్వం



రైతులు అవస్థలు పడుతుంటే అధికారులు సీఎం సభలంటూ హడావుడి చేయడం సిగ్గుచేటు. మంత్రులు, ఎమ్మెల్యేలకు రైతుల కష్టాలు పట్టడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆర్బీకేల ద్వారా ఎరువులు ఇండెంట్ పెట్టగానే రైతులకు అందేవి. రైతులపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వమిది.

– పాటిల్ అభిలాష్, రైతు విభాగం తాలూకా అధ్యక్షుడు, కళ్యాణదుర్గం

యూరియా ఇవ్వకుండా సభలంట



ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఇప్పుడు పంటకు యూరియా చాలా అవసరం. పంట దిగుబడి రావాలంటే యూరియా వేయాలి. రెండు నెలలుగా రైతు సేవా కేంద్రం చుట్టూ తిరుగుతూ.. వ్యవసాయ అధికారులను అడిగినా యూరియా రాలేదని చెబుతున్నారు. మా లాంటి రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతుంటే అధికారులు, పాలకులేమో సూపర్ సిక్స్ పథకాలు హిట్ అయ్యాయని సభలు పెట్టుకోవడం సిగ్గుచేటు.

–గొల్ల శివన్న, రైతు, కదిరిదేవరపల్లి, కంబదూరు మండలం

అన్నదాతకు తోడుగా నేడు వైఎస్సార్ సీపీ పోరు



అనంతపురం కార్పొరేషన్: రైతులను దగా చేసిన సీఎం చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం 'అన్నదాత పోరు' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో జరగనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై టవర్‌క్లాక్ మీదుగా ఆర్‌డీఓ కార్యాలయం చేరుకుంటుందన్నారు. అక్కడ ఆర్‌డీఓకు వినతి పత్రం అందిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, రైతులు, రైతు సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సీఎం చంద్రబాబు, కూటమి ప్రజాప్రతినిధులకు పట్టడం లేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు వైఎస్సార్ సీపీ అధిష్టానం 'అన్నదాత పోరు'కు పిలుపునిచ్చిందని తెలిపారు.

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం



శ్యాంసుందర్ (ఫైల్)

యాడికి/డోన్ టౌన్: కర్నూలు జిల్లా డోన్‌లోని బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో ఉంటున్న ఇంటర్ విద్యార్థి శ్యాంసుందర్ (16) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డోన్ సీఐ ఇంతియాజ్‌బాషా తెలిపిన మేరకు.. యాడికికి చెందిన చేనేత కార్మికులు రమేష్, సావిత్రి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శ్యాంసుందర్ డోన్‌లోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లిన విద్యార్థి ఆదివారం తిరిగి వసతి గృహానికి చేరుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున బాత్ రూంలో శ్యాంసుందర్ ఉరేసుకుని కనిపించాడు. ఉదయం కాలకృత్యాల కోసం బాత్‌రూంకు వెళ్లిన విద్యార్థులు గమనించి హాస్టల్ వార్డెన్ మేరీ సూర్యకుమారి, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్‌ఐలు శరత్‌కుమార్ రెడ్డి, నరేంద్రకుమార్, ఆర్డీఓ నరసింహులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కాగా విద్యార్థి మృతిపై తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, బీజేపీ నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర దర్యాప్తు చేపట్టాలని హాస్టల్ ఎదుట ఆందోళన చేశారు. అన్ని కోణాల్లో విచారించి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడతామని సీఐ తెలిపారు.

ఉద్యోగోన్నతి లేక ఉసూరు

- డీటీలకు అడహక్ పదోన్నతులపై దృష్టి సారించని ఉన్నతాధికారులు
- జేఏల విషయంలోనూ అలసత్వం
- నిరాశ నిస్పృహల్లో ఉద్యోగులు



అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగాన్ని ముందుండి నడిపించే రెవెన్యూ శాఖ ఉద్యోగుల్లో నిర్లిప్తత నెలకొంది. ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరి ఉద్యోగులను నిరాశ నిస్పృహల్లోకి నెడుతోంది. ఈ ప్రభావం వారి పనితీరుపైనా పడుతోంది. జిల్లాలో ఏడు చోట్ల తహసీల్దారు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని కూడేరు మండలంలో ఏడాది దాటినా రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించలేదు. తాడిపత్రి, వజ్రకరూరు, విడపనకల్లు తహసీల్దారు స్థానాలు కూడా ఖాళీగా ఉన్నాయి. కళ్యాణదుర్గం, అనంతపురం రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయాల్లో పరిపాలనాధికారి, కలెక్టరేట్‌లో భూ సంస్కరణల విభాగంలో స్థానాలు భర్తీ కాలేదు.

అడహక్ పదోన్నతులేవీ..?

తహసీల్దారు పదోన్నతి ప్యానల్‌లో ఉన్న డిప్యూటీ తహసీల్దార్లకు అడహక్ పదోన్నతి కల్పించి ఖాళీగా ఉన్న ఆయా స్థానాల్లో పోస్టింగ్ ఇస్తారు. దీంతో ఇన్‌చార్జ్ పాలనకు ఆస్కారం ఉండదు. గతంలో అనేక సార్లు ఇలానే అడహక్ పదోన్నతులు కల్పించి పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఆ దిశగా ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పదోన్నతుల కల్పనలో జాప్యం

రెవెన్యూ శాఖలో పదోన్నతులు ఎండమావులుగా మారాయి. ప్రధానంగా జూనియర్ అసిస్టెంట్‌లకు సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. రెవెన్యూ శాఖలో సీనియర్ అసిస్టెంట్ పోస్టులు 32 ఖాళీగా ఉన్నాయి. ఈ క్రమంలో పదోన్నతికి అర్హులైన జూనియర్ అసిస్టెంట్లు 30 మంది ఉన్నా ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవడంపై ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

పని నాణ్యతపై ప్రభావం

ప్రభుత్వ ఉద్యోగులు తమ సర్వీసులో కోరుకునేది పదోన్నతే. దీనికితోడు శాఖా పరంగా అందాల్సిన ప్రయోజనాలు సకాలంలో పొందితే ఉత్సాహంగా విధులు నిర్వర్తిస్తారు. అలాంటి కీలక విషయాల్లో తీవ్ర జాప్యం జరిగితే మానసిక వేదనకు గురవుతారు. ఆ ప్రభావం పడి పనిలో నాణ్యత లోపిస్తుంది. రెవెన్యూశాఖలో ప్రస్తుతం ఇలాంటి పరిస్థితే నెలకొంది. పదోన్నతులపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని రెవెన్యూ ఉద్యోగులు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ నరకం?!

- సర్వజనాస్పత్రిలో అటకెక్కిన ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణం
- చాలీచాలని పడకలతో గర్భిణులు, బాలింతలకు తప్పని అవస్థలు



ఒకే మంచంపై ఇద్దరేసి బాలింతలను ఉంచిన దృశ్యం

అనంతపురం మెడికల్: సర్వజనాస్పత్రిలో బాలింతలు, గర్భిణులకు అవస్థలు తప్పడం లేదు. చాలీచాలని పడకల నడుమ వారు నరకం చూస్తున్నారు. ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.300 కోట్లతో ఎంసీహెచ్, సర్జికల్ బ్లాక్, మెన్, ఉమెన్ పీజీ హాస్టళ్లు మంజూరయ్యాయి. అప్పట్లోనే సర్జికల్, పీజీ హాస్టళ్ల పనులు ప్రారంభమయ్యాయి. వైద్య కళాశాల ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.అయితే, సార్వత్రిక ఎన్నికలు రావడం.. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది.

నిర్మాణం కలగా..

వచ్చీ రాగానే చంద్రబాబు ప్రభుత్వం ఈ రూ.300 కోట్ల ప్రాజెక్ట్‌పై గుదిబండ వేసింది. ఏకంగా రూ.78 కోట్లకు కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటు కలగా మారింది. ప్రజారోగ్య పరిరక్షణకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సింది పోయి ఉన్న వాటిపైనే కక్ష కట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కష్టాలమయం..

ప్రస్తుతం సర్వజనాస్పత్రిలో గైనిక్ విభాగానికి నాలుగు యూనిట్లు ఉన్నాయి. 120 పడకలు అందుబాటులో ఉంచారు. ఇంకా లేబర్ వార్డు, లేబర్ ఐసీయూ, యాంటీ నేటల్, పోస్టునేటల్, గైనిక్, గైనిక్ ఐసీయూ, ఆరోగ్య శ్రీ, హై డిపెండెన్సీ యూనిట్‌లో 240 మంది గర్భిణులు, బాలింతలను ఉంచి సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలో రోజూ 20 నుంచి 25 ప్రసవాలు జరుగుతున్నాయి. అందులో 5 సిజేరియన్లు ఉంటాయి. గైనిక్ విభాగానికి సంబంధించి వార్డులు దూరందూరంగా ఉన్నాయి. చిన్నపిల్లల వార్డు ఆస్పత్రిలోని రెండో అంతస్తులో ఉంది. వసతులు లేని దృష్ట్యా మధ్యాహ్నం వరకే ఆపరేషన్లు చేస్తుండడంతో ఆ సమయం దాటాక మొదటి అంతస్తులో ఉన్న మెయిన్ ఓటీకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో గర్భిణులు, బాలింతలు నరకం చూడాల్సి వస్తోంది. ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటై ఉంటే ఒకే చోటే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలందించే అవకాశం ఉండేది. బ్లాక్‌లో కొత్తగా మరో 200 పడకలు ఏర్పాటు చేస్తే పదుల సంఖ్యలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, స్టాఫ్‌నర్సులు, తదితర పోస్టులు మంజూరయ్యే అవకాశం ఉండేది.

ముగ్గురు మంత్రులున్నా..

కూటమి ప్రభుత్వంలో సాక్షాత్తు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి జిల్లాకు మేలు చేసే విధంగా ఒక్క పని ఆయన చేయలేదు. గతంలో మంజూరైన ప్రాజెక్టులనైనా ఆచరణలోకి తీసుకువచ్చి పేదలకు మేలు చేద్దామనే ఆలోచన కూడా చేయకపోవడం గమనార్హం. ఇక మంత్రులు పయ్యావుల కేశవ్, సవితకు వారి నియోజకవర్గాల్లో వ్యవహారాలను చూసుకునేందుకు తీరికలేని పరిస్థితి నెలకొందనే విమర్శలు ఉన్నాయి.

క్లుప్తంగా

ఉపాధి అవకాశాలు కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట ఆటో కార్మికుల నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

అనంతపురం అర్బన్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుతో బాడుగలు లేక జీవనోపాధి కోల్పోయిన తమకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటూ ప్రభుత్వాన్ని ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడారు. వాహన మిత్ర పథకం కింద ప్రతి ఆటో కార్మికునికి రూ.30 వేలు ఇవ్వాలన్నారు. పట్టణ, మండల కేంద్రాల్లో ఆటో పార్కింగ్ స్థలాలు కేటాయించాలన్నారు. ఓలా, ఊబర్, రాపిడ్ సర్వీసులను రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వమే యాప్ నిర్వహించాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం డీఆర్‌ఓ మలోలకు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నముత్యాలు, ప్రసాద్‌బాబు, వెంకటరెడ్డి, స్వాతి, ఆరీఫ్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సుల ఢీ

- ముగ్గురికి గాయాలు

చెన్నేకొత్తపల్లి: స్థానిక 44వ జాతీయ రహదారిపై సోమవారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదంలో ఒకరికి కాలు విరిగింది. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. కేరళలోని అలపూరకు చెందిన ఏడుగురు యువకులు హైదరాబాద్‌లో కావడి ఉత్సవాన్ని ముగించుకుని తమ మినీ బస్సులో ఆదివారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. సోమవారం ఉదయం చెన్నేకొత్తపల్లి వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారి పక్కన ఆపిన కియా కంపెనీను వెనుక నుంచి ఢీకొనడంతో మినీ బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. కేరళకు చెందిన అర్జున్‌కు ఎడమ కాలు పాదం వద్ద విరిగింది. అగిల్, రాహుల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో సోమవారం 99 బస్తాల్లోని 45.7 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 50 బస్తాల్లోని 18.5 క్వింటాళ్ల జొన్నలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిల్వ చేసిన నాగార్జునను అరెస్ట్ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ నాగేంద్రభూపతి, సీఎస్‌డీటీ మల్లేష్, వీఆర్వో వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనంపై వేటు!



బొమ్మనహాళ్ మండలంలో నరికేసిన చెట్లు



దేవగిరి సమీపంలో భారీ వృక్షాన్ని నరికి కలపను తరలిస్తున్న దృశ్యం

- దశాబ్దాలుగా నీడనిచ్చిన చెట్ల కూల్చివేత
- యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

రాయదుర్గం/బొమ్మనహాళ్: దశాబ్దాలుగా నీడనిస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్న భారీ వృక్షాలు గొడ్డలి వేటుకు కనుమరుగవుతున్నాయి. నడిరోడ్డైనా, అటవీ ప్రాంతమైనా, ఇళ్ల వద్దనైనా ఎక్కడైనా సరే పచ్చని చెట్లను నరికేసి కలప అక్రమ రవాణా సాగిస్తున్నారు. దీంతో రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు క్రాస్ నుంచి బొమ్మనహాళ్ మీదుగా కర్ణాటకలోని బళ్లారికి వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు కనుమరుగయ్యాయి. దేవగిరి క్రాస్ సమీపాన ప్రధాన రహదారి పక్కన ఉన్న భారీ వృక్షాన్ని ఇటీవల అందరూ చూస్తుండగా కూల్చి కలపను వాహనాల్లో తరలించారు.పలు గ్రామాల్లోని చింతచెట్లు కూల్చి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని చాలా మండలాల్లో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో పచ్చదనం తరిగిపోతుంది.

పరిశీలించి చర్య తీసుకుంటాం

కలప అక్రమ రవాణాను కట్టడి చేశాం. దేవగిరి సమీపంలో రోడ్డు పక్కన ఉండే భారీ వృక్షాన్ని కూల్చింది ఎవరో విచారించి చర్యలు తీసుకుంటాం. అటవీశాఖ అనుమతుల్లేకుండా చెట్టు నరికితే క్రిమినల్ చర్యలు చేపడతాం .వాల్టా చట్టం అమలుకు తప్పక కృషి చేస్తాం.

– దామోదరరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, రాయదుర్గం

వాల్టా .. ఉల్టా !

జిల్లాలోని కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వాల్టా (నీరు, భూమి, వృక్షం) చట్టం అమలు కాగితాలకే పరిమితమైపోయింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 16 నెలలు కావస్తున్నా వాల్టా చట్టం పై ఏనాడు సమీక్షా సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు. దీంతో పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా బోర్లు తవ్వుతున్నారు. వృక్ష సంపదను నేల కూలుస్తున్నారు. అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తూ వాగులు, గుట్టలను కొల్లగొడుతున్నారు.

సెక్యూరిటీ గార్డు దుర్మరణం



మస్తాన్ (ఫైల్)

తాడిపత్రి రూరల్: మండలంలోని బుగ్గ వద్ద నిద్రిస్తున్న సెక్యూరిటీ గార్డు మస్తాన్(50)పై లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం వేకువ జామున ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన మేరకు.. తాడిపత్రి పట్టణానికి చెందిన మస్తాన్.. హైవే సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుక్క వద్ద ఆదివారం రాత్రి విధులకు వెళ్లిన మస్తాన్ సోమవారం వేకువ జామున షెడ్‌లో నిద్రకు ఉపక్రమించాడు. అదే సమయంలో నంద్యాల నుంచి తాడిపత్రి వైపుగా వస్తున్న లారీ రేకుల షెడ్‌ను ఢీకొని దూసుకెళ్లింది. ఘటనలో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాత్కాలిక బిషప్‌గా బెన్హర్‌బాబు



రెవరెండ్ బెన్హర్‌బాబును అభినందిస్తున్న పాస్టర్లు

అనంతపురం కల్చరల్: సుదీర్ఘ చరిత్ర కలిగిన సీఎస్‌ఐ రాయలసీమ డయాసిస్ తాత్కాలిక బిషప్‌గా రెవరెండ్ బెన్హర్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా బిషప్ రెవరెండ్ డాక్టర్ పి.ఐజాక్ వరప్రసాదరెడ్డి టర్కీ వెళ్లిన నేపథ్యంలో రెవరెండ్ బెన్హర్‌బాబుకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం బాధ్యతలు స్వీకరించిన ఆయనను పాస్టర్లు మనుష్యే, మార్క్, జీఆర్ ఆనంద్, జహంగీర్, జాషువా, చార్లెస్ నాయక్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

రేపు 'అనంత'లో ట్రాఫిక్ మళ్లింపు

అనంతపురం: సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఈ నెల 10న అనంతపురంలో ట్రాఫిక్‌పై ఆంక్షలు విధిస్తున్నట్లు ఎస్పీ జగదీష్ ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

- హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు వడియంపేట నుంచి బుక్కరాయసముద్రం – నాయనపల్లి క్రాస్ – నార్పల క్రాస్ – బత్తలపల్లి – ధర్మవరం – ఎస్ఎస్‌గేట్ మీదుగా 44వ జాతీయ రహదారిపైకి చేరుకోవాలి.
- కర్నూలు నుంచి తిరుపతి, చెన్నై వెళ్లే వాహనాలు వడియంపేట – బుక్కరాయసముద్రం – నాయనపల్లిక్రాస్ – నార్పల క్రాస్ – బత్తలపల్లి – కదిరి – మదనపల్లి మార్గంలో ప్రయాణించాలి.
- బళ్లారి నుంచి బెంగళూరు వెళ్లే వాహనాలు అనంతపురంలో ప్రవేశించకుండా చెళ్లకెర – తుమకూరు – నెలమంగల మీదుగా ప్రయాణించాలి.
- బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు ఎస్ఎస్‌గేట్ వద్ద నుంచి ధర్మవరం – బత్తలపల్లి – నార్పల క్రాస్ – నాయనపల్లి క్రాస్ – బుక్కరాయసముద్రం – వడియంపేట మీదుగా 44వ జాతీయ రహదారిపైకి చేరుకోవాలి.
- తిరుపతి/చెన్నై నుంచి కర్నూలు వెళ్లే వాహనాలు బత్తలపల్లి వద్ద నుంచి నార్పల క్రాస్ – నాయనపల్లి క్రాస్ – బుక్కరాయసముద్రం – వడియంపేట మీదుగా ప్రయాణించాలి.
- బెంగళూరు నుంచి బళ్లారి వెళ్లే వాహనాలు అనంతపురం మీదుగా కాకుండా బెంగళూరు – నెలమంగల– తుమకూరు
- చెళ్లకెర మార్గంలో ప్రయాణించాలి.

రూ.12.80 లక్షల విలువైన వాహనాల స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: నగరంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలను అపహరిస్తున్న పాతూరులోని పెద్దమ్మగుడి ప్రాంతంలో నివాసముంటున్న ఖాదర్ బాషా కుమారుడు షేక్ ఖాజాపీర్‌ను అరెస్ట్ చేసినట్లు అనంతపురం రెండో పట్టణ పీఎస్ ఎస్‌ఐ రుష్యేంద్రబాబు తెలిపారు. ప్రసన్నాయపల్లి రైల్వే గేట్ సమీపంలో అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ వద్ద సోమవారం అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఖాజాపీర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో విషయం వెలుగు చూసిందన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రూ.12.80 లక్షల విలువ చేసే మూడు ఆటోలు, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కాగా, ఇదివరకే ద్విచక్ర వాహనాల అపహరణ కేసులో ఖాజాపీర్ పాత నేరస్తుడని, రిమాండ్‌కు వెళ్లి విడుదలైన అనంతరం తన పంథాను కొనసాగిస్తూ వస్తున్నాడని తెలిపారు.

ఇమామ్, మౌజన్‌లకు దగా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం నాయకులు

- ఇచ్చిన హామీని విస్మరించిన సీఎం చంద్రబాబు
- 11 నెలలుగా గౌరవవేతనమూ నిలిపివేత
- కలెక్టరేట్ ఎదుట వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం ధర్నా

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో ఇమామ్, మౌజన్‌లు దగా పడ్డారని వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం నాయకులు ధ్వజమెత్తారు. అధికారంలోకి వస్తే ప్రతి నెలా ఇమామ్‌లకు రూ.10వేలు, మౌజన్‌లకు రూ.5వేలు గౌరవ వేతనం ఇస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు విస్మరించారని మండిపడ్డారు. 11 నెలలుగా గౌరవేతనం కూడా ఇవ్వకుండా అన్యాయం చేస్తోందన్నారు. తక్షణం పెండింగ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు మొఘల్ సైఫుల్లా బేగ్ అధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట మైనారిటీ నాయకులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. సైఫుల్లాబేగ్‌తో పాటు ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీమ్ అహమ్మద్, మేయర్ వసీం సలీమ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్‌బాషా, రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర రిజ్వాన్ మాట్లాడారు. ముస్లిం మైనారిటీల విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. ఇమామ్, మౌజన్‌లకు 11 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వకుండా నిలిపివేశారన్నారు. దీంతో మత పెద్దలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం గౌరవ వేతనం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అబుసలేహా, ఇషాక్, రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మైనారిటీ నాయకులు గౌస్‌బేగ్, వేముల నదీమ్, కొర్రపాడు హుసేన్ పీరా, మన్సూర్‌బాషా, ఆసిఫ్, ఖాజా, మహబూబ్‌బాషా, ఖమర్‌తాజ్, షేక్ జావీద్, ఖాదర్‌బాషా, రియాజ్, అంజాద్ ఖాన్, జిలాన్, ఖాజాపీర్, షకీల్, దాదాపీర్, సాదిక్, సలాం, అన్సర్, హుసేన్, మీరన్‌బాషా, ఎంఏ జిలాన్, శర్మాస్, షమీ, రియాజ్, అమ్రుల్లా, అఫ్రోజ్, అఫ్జల్, షేక్షావలి, దాదు, ఇబ్రహీం, జాకీర్, ఖాసీం, అబ్దుల్ రెహమాన్, చాంద్‌బాషా, ఎండీఆర్ ఖలీల్, నూర్ నిజామీ, ఫ్లయింగ్ మాబూ, కరీమ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో వృద్ధుడి మృతి



వృద్ధుడి మృతదేహం

గుంతకల్లు: స్థానిక రైల్వేస్టేషన్‌లోని మూడో ప్లాట్‌ఫారంపై ఓ గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 60 నుంచి 65 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి ప్లాట్ ఫారంలోని 22వ పోల్ వద్ద అనారోగ్యంతో మృతి చెందాడు. చామఛాయ రంగు కలిగి ఉన్నాడు. గడ్డం పెరిగి ఉంది. ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి



శివ (ఫైల్)

రాయదుర్గం టౌన్: మిత్రులతో సరదాగా గడిపేందుకు వచ్చిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని దావణగెర జిల్లా తొలహునిసె గ్రామానికి చెందిన శివ (40) అవివాహితుడు. రాయదుర్గంలోని తన మిత్రులు రాము, మల్లికార్జునను కలిసేందుకు ఆదివారం మధ్యాహ్నం వచ్చాడు. అదే రోజు రాత్రి రాత్రి 10 గంటల సమయంలో వాల్మీకినగర్‌లోని మిట్టపై రోడ్డు దాటుతున్న శివను రాయదుర్గం నుంచి మెచ్చిరి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతున్న భాస్కర్, కృష్ణ ఢీకొన్నారు. ఘటనలో గాయపడిన ముగ్గురినీ స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక శివ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

జాగ్రత్తగా వ్యవహరించండి : కలెక్టర్

అనంతపురం అర్బన్: సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన నేపథ్యంలో జన సమీకరణలో జాగ్రత్తలు పాటించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. సీఎం పర్యటనపై సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా శాఖల అధికారులు, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందితో కలెక్టర్ సమీక్షించారు. జనాల తరలింపు కార్యక్రమాన్ని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించాలన్నారు. మండలాల నుంచి ఏ సమయానికి బస్సు బయలుదేరాలి అనేది ముందుగానే గుర్తించాలన్నారు. మ్యాపింగ్ ప్రకారం నిర్దేశించిన పార్కింగ్‌కు బస్సులు వెళ్లాలన్నారు. పార్కింగ్ ప్రదేశంలోనే అందరూ దిగేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, ఎస్‌డీసీ తిప్పేనాయక్, డీఆర్‌డీఏ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీంబాషా, మెప్మా పీడీ విశ్వజ్యోతి, ఇతర అధికారులు, కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



సురేష్ (ఫైల్)

కణేకల్లు: విద్యుత్ షాక్‌కు గురై ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ సురేష్ (25) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్‌కు చెందిన సురేష్‌కు భార్య పవిత్ర, తల్లిదండ్రులు లింగమ్మ, వన్నూరుస్వామి ఉన్నారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఎలక్ట్రీషియన్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం కణేకల్లు మండలం ఎస్‌ఆర్ఎస్ క్యాంపులో రైతు పొలంలో విద్యుత్ సమస్య తలెత్తడంతో మరమ్మతు చేసేందుకు వెళ్లాడు. స్టార్టర్ వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన రైతులు వెంటనే బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఘటనపై కణేకల్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాము కాటుకు చిన్నారి బలి



హేమాశ్రీ

బ్రహ్మసముద్రం: పాము కాటుకు గురై ఆరేళ్ల చిన్నారి మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లికి చెందిన హరిజన బడిగే మల్లికార్జున, మారెక్క దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరి పెద్ద కుమార్తె హేమాశ్రీ (6) ఈ నెల 5న పాము కాటుకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆగమేఘాలపై కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. మూడు రోజుల అనంతరం పరిస్థితి విషమించి సోమవారం బాలిక మృతి చెందింది. సోమవారం సాయంత్రం చిన్నారి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడంతో స్థానికులు విషాదంలో మునిగిపోయారు.

పోకిరీకి దేహశుద్ధి



మహేష్‌ను స్తంభానికి కట్టేసిన దృశ్యం

కదిరి అర్బన్: వివాహితను వేధించిన పోకిరీకి స్థానికులు దేహశుద్ధి చేశారు. కదిరి మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. నల్లమాడ మండలానికి చెందిన యువకుడు మహేష్ మద్యం మత్తులో ఓ వివాహితతో ఆమె ఇంటి వద్ద అసభ్యంగా ప్రవర్తిస్తూ తన కోరిక తీర్చాలని గొడవకు దిగాడు. గమనించిన భర్త, బంధువులు వెంటనే మహేష్‌ను పట్టుకుని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. కాగా, ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

'కేఎస్ఎన్' హాస్టల్‌లో పాముల కలకలం



పామును చంపేస్తున్న విద్యార్థినులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల హాస్టల్‌లో విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గదుల్లో నిద్రపోతున్న విద్యార్థినులను ఇటీవల ఎలుకలు కరిచి ఆస్పత్రి పాలైన సంగతి మరవకముందే తాజాగా పాముల సంచారం బెంబేలెత్తిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి హాస్టల్ ఆవరణలో రెండు పాములు కనిపించాయి. ఓ పామును కట్టెతో కొట్టి చంపేశారు. మరోపాము కనిపించకుండా పోయింది. రాత్రి 11.30 గంటల సమయంలో చదువుకుంటున్న కొందరు విద్యార్థినులు బాత్రూంకు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. గట్టిగా కేకలు వేయడంతో ఇతర గదుల్లో ఉన్న అమ్మాయిలందరూ బయటకు వచ్చారు. పాములు చూసి భయంతో చాలా మంది విద్యార్థినులు గదుల్లోకి పరుగు తీశారు.

భూములు బీడు.. రైతుల గోడు

వర్షాభావ పరిస్థితులు అన్నదాతలను కుదేలు చేశాయి. ఫలితంగా ఖరీఫ్‌లో పంట వేసుకునే అవకాశాలు లేక పలువురు రైతులు తమ పొలాలను బీడుగా వదిలేశారు. ప్రత్యామ్నాయం చూపాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో అన్నదాతల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.



- జిల్లా వ్యాప్తంగా 87 వేల హెక్టార్లు బీళ్లుగానే దర్శనం
- ప్రత్యామ్నాయం చూపని కూటమి సర్కారు
- ఖరీఫ్ సాగు విస్తీర్ణం లెక్కలపై అనుమానాలు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంటల సాగు 2.56 లక్షల హెక్టార్లకు చేరింది. ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లు కాగా 75 శాతం విస్తీర్ణంలో పంటలు వేసినట్లు వ్యవసాయశాఖ తాజా నివేదిక విడుదల చేసింది. ఈ లెక్కన ఇంకా 87 వేల హెక్టార్లు బీడు భూములుగా మిగిలాయి. ఒక్క ఎకరా కూడా ఖాళీగా ఉండకూడదని కూటమి సర్కారు చెబుతున్నా.. ఆ దిశగా బీడు భూములు సాగులోకి వచ్చేలా ప్రత్యామ్నాయం చూపడం లేదు. అక్టోబర్ నుంచి రబీ ప్రారంభం కానుండటంతో ప్రత్యామ్నాయం కింద ఉలవ, కొర్ర, జొన్న లాంటి విత్తనాలు ఇచ్చే పరిస్థితి ఇప్పట్లో లేదు.

సాగు గణాంకాలపై అనుమానాలు:

వేరుశనగ, కంది, ఆముదం, పత్తి లాంటి ప్రధాన పంటలు విత్తుకునేందుకు నెల రోజుల కిందటే గడువు ముగిసినా ఇప్పటికీ వారం వారం విడుదల చేస్తున్న నివేదికలో విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. ప్రతి వారం 20 నుంచి 30 వేల హెకార్లు పెంచుతూ గణాంకాలు విడుదల చేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆగస్టు 10 నాటికి 1.68 లక్షల హెక్టార్లు, ఆగస్టు 26 నాటికి 2.21 లక్షల హెక్టార్లు, సెప్టెంబర్ ఒకటి నాటికి 2.44 లక్షల హెక్టార్లు, సెప్టెంబర్ 8న 2.56 లక్షల హెక్టార్లు... ఇలా ఖరీఫ్ పెరుగుతోంది. ఆగస్టు, సెప్టెంబర్‌లో ప్రత్యామ్నాయ పంటల విస్తీర్ణం పెరగాల్సి ఉండగా.. వేరుశనగ, కంది, ఆముదం, పత్తి పెరగడం విశేషం. మరోపక్క ఈ-క్రాప్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. 2.55 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి రాగా ఇందులో సగం విస్తీర్ణం కూడా పంట నమోదు చేయని పరిస్థితి. ఈ-క్రాప్‌కు కూటమి సర్కారు ప్రాధాన్యత తగ్గించడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

జిల్లాలో సాగైన పంటల వివరాలు..

కంది	93,657 హెక్టార్లు
వేరుశనగ	78,131 హెక్టార్లు
పత్తి	22,687 హెక్టార్లు
మొక్కజొన్న	21,146 హెక్టార్లు
ఆముదం	14,448 హెక్టార్లు
సజ్జ	3,385 హెక్టార్లు
వరి	18,716 హెక్టార్లు

ఉలవ, పెసర, అలసంద, మినుము, కొర్ర, జొన్న, సోయాబీన్, పొద్దుతిరుగుడు లాంటి ప్రత్యామ్నాయ పంటలు నామమాత్రంగా సాగులోకి వచ్చాయి.

పురాతన నగరేశ్వరాలయంలో ఉబికి వస్తున్న నీరు



జలమయమైన గర్భగుడి

గుత్తి: పట్టణంలోని కోట ముఖ ద్వారం వద్ద ఉన్న పురాతన నగరేశ్వరాలయ గర్భగుడిలో నీరు ఉబికి వస్తోంది. గత 15 రోజులుగా నీరు ఉబికి వస్తుండడంతో మోటార్ల సాయంతో పంపింగ్ చేస్తున్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి సెపక్ తక్రా పోటీలు



గౌరవ వందనం సమర్పిస్తున్న క్రీడాకారులు

ఉరవకొండ రూరల్: మండలంలోని నింబగల్లు జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో ఆ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లాస్థాయి బాలబాలికల సెపక్ తక్రా పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 12 జట్లు పాల్గొన్నాయి. ఎంఈఓ ఈశ్వరప్ప ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సీసీ కెమెరాలను పూర్వ విద్యార్థులు వితరణ చేశారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంను కలిసే అవకాశం కల్పించండి



అర్జీ ఇస్తున్న బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, నాయకులు

అనంతపురం అర్బన్: సీఎం చంద్రబాబును కలిసే అవకాశం కల్పించాలని డీఆర్ఓ ఎ.మలోలకు బెస్త సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్ఓను సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, కోశాధికారి నాగేంద్ర, ఉపాధ్యక్షుడు గంగప్ప, కార్యదర్శి హరినాథ్‌బాబు, తదితరులు కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవిని పట్టపు కులానికి ఇవ్వడం అన్యాయమన్నారు. దాన్ని రద్దు చేసి బెస్తలకే ఇవ్వాలన్నారు. మత్స్య సహకార సంఘాలు ఉన్న రాయలసీమలో ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ కోఆపరేటివ్ ఫెడరేషన్ (ఆప్కాఫ్) చైర్మన్ పదవిని రాయలసీమ బెస్తలకే ఇవ్వాలన్నారు. అన్ని నామినేటెడ్ పదవుల్లో బెస్తలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు

అనంతపురం ఎడ్యుకేషన్: యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలు చిత్తు చేసుకోవద్దని ఈగల్ టీమ్ ఎస్ఐ హనుమంతు సూచించారు. సోమవారం నగరంలోని పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో 'డ్రగ్స్ వద్దు బ్రో – గంజాయి, మత్తు పదార్థాల వాడకం జీవితాన్ని నాశనం చేస్తుంది' అనే నినాదంతో గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఏకగ్రీవంగా 'డ్రగ్స్ కు దూరంగా ఉంటాం' అంటూ ప్రతిజ్ఞ చేశారు. గంజాయి, మత్తుపదార్థాల సమాచారం తెలిస్తే డయల్ 1972కు కాల్ చేయొచ్చని ఎస్ఐ తెలిపారు.

మారుతున్న జీవనశైలితోనే అనారోగ్యం



స్టాళ్లను పరిశీలిస్తున్న కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: మారుతున్న జీవనశైలితోనే అనారోగ్యంబారిన పడుతున్నట్లు ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధరరెడ్డి తెలిపారు. సోమవారం కళాశాల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరానికి అత్యవసరమన్నారు. కళాశాల ఏఓ శ్రీనాథ్, బయోసైన్స్ విభాగం అధ్యాపకులు యస్.రిజ్వానాబేగం, జి.సాయిప్రీతి, మలీహా, కళ్యాణ్‌చక్రవర్తి, సుమంత్, సుదర్శన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ముంబై సదస్సుకు మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: ముంబైలో ఈనెల 9న జరగనున్న సదస్సుకు నగర మేయర్ వసీం హాజరుకానున్నారు. ముంబైలోని వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో 'పట్టణ జీవనాన్ని మెరుగుపర్చడంలో సాంకేతిక పాత్ర' అంశంపై సదస్సు జరగనుంది. ఇదే సదస్సుల్లో స్మార్ట్ సిటీస్ అనే అంశంపై మేయర్ వసీం వక్తగా పాల్గొననున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల మేయర్లు సదస్సుకు హాజరవుతున్నారని, అందులో తనకు పిలుపురావడం సంతోషంగా ఉందని మేయర్ వసీం పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రహణ పూజలు

అనంతపురం కల్చరల్: సంపూర్ణ చంద్రగ్రహణంతో మూతబడిన ఆలయాల్లో సోమవారం తెల్లవారుజామున నుంచే విశేష పూజలు, ఆలయ శుద్ధి పూజలు జరిగాయి. మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, ఆర్ఎఫ్‌రోడ్డు, రామనగర్, హౌసింగ్‌బోర్డు వేంకటేశ్వరాలయం, బెంగళూరురోడ్డులోని శివకోటి, శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమాల్లో పార్వతీ పరమేశ్వర్లకు రాహుపాశుపత రుద్రాభిషేకాలు, దీపశాంతి, అలంకార సేవలు నవగ్రహాలకు తైలాభిషేకాలు జరిగాయి.

పేరులోనే ప్రణాళిక.. అంతా అస్తవ్యస్తమే



- 'టౌన్‌ప్లానింగ్'లో సిబ్బంది కొరత
- 16 మంది ఉండాల్సిన చోట ఇద్దరే బాధ్యతలు
- నగరంలో ఇబ్బడి ముబ్బడిగా అనధికార నిర్మాణాలు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగం అస్తవ్యస్తంగా మారింది. పట్టణ ప్రణాళిక విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. 16 మంది ఉండాల్సిన చోట ఇద్దరితోనే నెట్టుకొస్తున్నారు. నగరంలో ఇబ్బడిముబ్బడిగా అనధికార నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకునేవారు లేరన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో 99 శాతం అనధికార నిర్మాణాలే. 'నక్ష' కార్యక్రమం నత్తనడకన సాగుతోంది. కూటమి ప్రభుత్వం 'విజన్ 2047' ప్రచారం చేస్తున్నా.. నగరాన్ని అపురూపంగా తీర్చిదిద్దాల్సిన పాలకులు ఆదిశగా చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

• నగరంలోని 50 డివిజన్లలో వందల సంఖ్యలో భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. నగర నడిబొడ్డున ఉన్న సుభాష్‌రోడ్డు, గుల్జార్‌పేట, ఆదిమూర్తి నగర్, సాయినగర్, కమలానగర్, విద్యుత్ నగర్, హౌసింగ్ బోర్డు, వేణుగోపాల్ నగర్, కోర్టు రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్లాన్ ఒకలా తీసుకుని నిర్మాణాలు బహుళ అంతస్తులు నిర్మించేస్తున్నారు. నగరాభివృద్ధి జరగాలంటే రోడ్ల విస్తరణతో పాటు నిర్మాణాలు నిబంధనల మేరకు కట్టుకోవాలి. కానీ నగరంలో అలాంటి పరిస్థితి లేదు. సెల్లార్లకు అనుమతి లేకున్నా..ఇష్టమొచ్చినట్లు కట్టేస్తున్నారు. ఇప్పటికే 256 నిర్మాణాలు అనుమతులకు విరుద్ధంగా నిర్మించారని నగర పాలక సంస్థ అధికారులు చార్జ్‌షీట్లు దాఖలు చేశారు. వాటిని వసూలు చేస్తే రూ.వంద కోట్ల వరకు నగరపాలక సంస్థకు ఆదాయం వస్తుంది. నగరంలో ఇష్టానుసారంగా సైన్ బోర్డులు, లాలీపప్స్, క్యాండీలివర్లకు అనుమతులిచ్చేశారు. కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై ఏకంగా రూ.లక్షలు వచ్చే ఆదాయాన్ని పప్పులు, వేరుశనగకాయలు అమ్మే విధంగా ధారాదత్తం చేశారు. దీంతో నగరంలో ఎక్కడ చూసినా ప్రకటన బోర్డులు వెలిశాయి. గతంలో ప్రకటన బోర్డుల ద్వారా రావాల్సిన రూ.50 లక్షలు ఇంత వరకు వసూలు కాలేదు. దీంతో పాటు షెడ్ల పేరుతో భారీ వ్యాపారాలు జరుగుతున్నారు. కేవలం వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ కట్టేసి, బెటర్‌మెంట్ చార్జీలను ఎగ్గొడుతున్నారు.

ఖాళీ పోస్టుల భర్తీ చేసేదెన్నడో..?

అత్యంత కీలకమైన విభాగంలో ఇద్దరు ఏసీపీలు, టీపీఎస్‌లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇప్పుడు టీపీఓ శిరీష, టీపీఎస్ మంజులమ్మలే టౌన్ ప్లానింగ్‌ను చూసుకోవాల్సి వస్తోంది. విజన్ 2047 అంటూ కూటమి ప్రభుత్వం చెబుతున్న తరుణంలో నిర్మాణాలు నిబంధనలకు లోబడి నిర్మించేలా చర్యలు తీసుకోవడంతో పాటు నడిమివంక, మరువ వంకలపై ఎలాంటి అడ్డగోలు నిర్మాణాలు జరగకుండా చూసుకోవాలి. కానీ అలాంటి పరిస్థితి లేదు.

వారిద్దరిది ఇష్టారాజ్యం..

నగరపాలక సంస్థలో టీపీఓ శిరీష, టీపీఎస్ మంజులమ్మలు ఇద్దరూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి. ఐదుగురు పట్టణ ప్రణాళిక కార్యదర్శులు ఒక బృందంగా ఏర్పడి అనధికార నిర్మాణాలు జరిగే చోటకు వెళ్లి, నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. తిరిగి అటువైపు తొంగి చూడడం లేదు. స్థానికంగా ఉండే తెలుగు తమ్ముళ్లు వీరి అడ్డగోలు వ్యవహారాలకు వంతపాడుతుండడంతో నగరంలో అనధికార నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

మంత్రి స్పందిస్తేనే..

గతంలో జిల్లా కేంద్రానికి వచ్చిన మంత్రి నారాయణ నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని బలోపేతం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మీడియా సాక్షిగా ప్రగల్భాలు పలికారు. కానీ మరోసారి జిల్లాకు వచ్చిన మంత్రి ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

సూపర్ హిట్ సభ పెట్టడం సిగ్గుచేటు

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ధ్వజం



ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కూటమి మేనిఫెస్టోను ప్రదర్శిస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం అర్బన్: అన్ని వర్గాల సంక్షేమాన్ని గాలికొదిలేసిన సీఎం చంద్రబాబు అనంతపురంలో సూపర్ హిట్ సభ పెట్టడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. కార్మిక సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు. సోమవారం స్థానిక నగర పాలక సంస్థ వద్ద ఎన్నికల సందర్భంగా ప్రజలకు హామీలిస్తూ ప్రకటించిన కూటమి మేనిఫెస్టోను సీఐటీయూ నాయకులు ప్రదర్శించారు. నాగేంద్ర మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఏ ఒక్క హామీని సక్రమంగా అమలు చేయకుండా సూపర్ హిట్ సభ పెట్టడం సిగ్గు అనిపించడం లేదాని నిలదీశారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌వీ నాయుడు, వెంకటనారాయణ, ముత్తూజ, నాగభూషణం, నాగరాజు, పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

రాప్తాడు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.రాజశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మిషన్ శక్తి కార్యక్రమంలో గృహహింస, వరకట్న నిషేధ చట్టం, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, రక్షణా విధానాలు, పోషకాహారం, ప్రభుత్వ పథకాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్ బి.ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ మహిళ, శిశు సంక్షేమం, సంరక్షణ కోసం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ నిత్యం అందుబాటులో ఉంటుందన్నారు.న్యాయవాదులు మహేశ్, అనూష, సీడీపీఓ ఉమా శంకరమ్మ, 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, ఓఎస్‌సీ కేస్ వర్కర్ శాంతామణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మోహన పరుస్తున్న నాటక పోటీలు



సత్యభామ, రుక్మిణీలతో శ్రీకృష్ణుడి సరస సంభాషణల ఘట్టం

అనంతపురం కల్చరల్: నగరంలో నాలుగు రోజులుగా సాగుతున్న రాష్ట్రస్థాయి నాటక పోటీలు ఆద్యంతం అలరిస్తున్నాయి. భగవాన్ శ్రీ సత్యసాయి నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటక పోటీల్లో భాగంగా సోమవారం అనకాపల్లికి చెందిన కళాకారుల 'గయోపాఖ్యానం' పౌరాణిక పద్య నాటకం, తెలంగాణాలోని సూర్యాపేట్ జిల్లా వారి 'భక్త చింతామణి', కామక్కపల్లి వారి 'శ్రీకృష్ణ తులాభారం' సాయంత్రం కణేకల్లు మండలం వారి 'సత్యహరిశ్చంద్ర' కాటిసీను, గుంటూరు జిల్లా వారి 'పల్నాడు యుద్ధం' నాటకాలు ఎంతో ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు దివాకర్, రామిరెడ్డి, సంజీవరెడ్డి, సీనియర్ రంగస్థల నటులు నారాయణస్వామి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాటక పోటీల ముగింపు వేడుకలు మంగళవారం అనంతనాగ్ సంగీత్ ప్వర్ కల్చరల్ అసోసియేషన్ వారి సంగీత విభావరితో ముగుస్తాయి. విజేతలకు బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని దక్షిణభారత సాంస్కృతిక మండలి మాజీ సభ్యుడు మైకేల్‌బాబు తెలిపారు.

'అన్నదాత పోరు ర్యాలీకి తరలిరండి'

చెన్నేకొత్తపల్లి: రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించ తలపెట్టిన 'అన్నదాత పోరు' ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో కోరారు. అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తామన్నారు. మండలం నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున కార్యక్రమానికి తరలిరావాలని ఆయన కోరారు.

ఆత్మకూరు: జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు, ప్రజలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలపోతన్న, యూత్ కన్వీనర్ కొండారెడ్డి సోమవారం తెలిపారు.

సీఎం పర్యటనపై డీజీపీ సమీక్ష



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

అనంతపురం: నగరంలో ఈ నెల 10న సూపర్ సిక్స్– సూపర్ హిట్ విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. ఈసందర్భంగా సీఎం భద్రతా ఏర్పాట్లను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సమీక్షించారు. అనంతపురం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో డీజీపీ భద్రతా సమీక్ష నిర్వహించారు. అడిషనల్ డీజీపీ మధుసూదన్ రెడ్డి (శాంతిభద్రతలు) పాల్గొన్నారు. సభాస్థలి, వేదిక, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాల వద్ద బందోబస్తు, హైవేపై ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లను డీజీపీ సమీక్షించారు. మొత్తం బందోబస్తు ప్రణాళికను పీపీటీ ద్వారా ఎస్పీ పి. జగదీష్ వివరించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమీక్షలో ఆపరేషన్స్ ఐజీపీ సీహెచ్ శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి, డీఐజీలు సెంథిల్ కుమార్, కోయ ప్రవీణ్, గోపీనాథ్ జెట్టి, అమ్మిరెడ్డి, విజయరావు, బి. సత్య యేసుబాబు, డాక్టర్ పక్కీరప్ప కాగినెల్లి, కేకేఎన్ అన్బురాజన్, ఉమ్మడి అనంతపురం జిల్లాల ఎస్పీలు పి. జగదీష్, రత్న పాల్గొన్నారు.

అక్షరాస్యతా దినోత్సవం

అనంతపురం : నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సోమవారం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విశ్రాంత డీఎస్పీ హరి తదితరులు డాక్టర్ బృంద, సీనియర్ ఆడిటర్ పాల్, విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీరాములు, డాక్టర్ రామలింగయ్య, డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం జిల్లా గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని ఇటీవల డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలు సాధించిన 9 మందిని సత్కరించారు. అక్షరాశ్యత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు అందించారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

అనంతపురం సిటీ: రాష్ట్రంలోని భవన, ఇతర నిర్మాణ రంగాల్లోని కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ మల్లికార్జున రావు (బాబ్జి) తెలిపారు. సోమవారం అనంతపురంలోని కార్మిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. హౌసింగ్ బోర్డులోని విజయనగర్ లా కాలేజీలో కార్మిక శాఖ అధికారులతో పాటు కార్మిక సంఘాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం, శ్రీసత్యసాయి జిల్లాల కార్మిక శాఖ సహాయ కమిషనర్లు లావణ్య, శ్రీకాంత్ నాయక్, సూర్యనారాయణ, సుజాత, రాధా రమాదేవి, విజయనగర లా కాలేజీ ప్రిన్సిపల్ లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రైతుల సమస్యల పరిష్కారంలో విఫలం

అనంతపురం రూరల్/ ఆత్మకూరు/ రాప్తాడు/ కనగానపల్లి: రైతు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మండిపడ్డారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ రైతులు అనేక సమస్యలతో సతమతమవుతుంటే కూటమి ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. యూరియా కోసం రైతులు పడిగాపులు కావస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరేష్, దుర్గాప్రసాద్, వెంకటరాముడు, అక్కులప్ప, రెడ్డప్ప, గోవిదరాజు పాల్గొన్నారు. అలాగే ఆత్మకూరు, కనగానపల్లి,రాప్తాడు మండల కేంద్రాల్లో సీపీఐ నాయకులు ఆందోళనలు నిర్వహించారు.

శరన్నవరాత్రి వేడుకల పోస్టర్ల విడుదల

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో వైభవంగా సాగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్లను సోమవారం రాత్రి ఆవిష్కరించారు. ఊంజల సేవ అనంతరం ఈవో నాగేంద్రుడు, భక్తమండలి సభ్యులు మాట్లాడారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల 2 వరకు నవరాత్రి వేడుకలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి, కిశోర్, భక్తమండలి సభ్యులు నరేంద్ర చౌదరి, ఎర్రిస్వామి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయాలని సీపీఐ ధర్నా

అనంతపురం అర్బన్: దళితులకు కేటాయించిన భూమిని వారికి అప్పగించి న్యాయం చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు, బాధితులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.నారాయస్వామి మాట్లాడారు. జంతులూరు గ్రామ పొలం సర్వే నంబరు 276లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని వీఆర్ఓ కుమారస్వామి ఆ భూమిని తన భార్య, అత్త పేరిట చెరో 2.50 ఎకరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకొని ఇతరులకు విక్రయించాడన్నారు. డీఆర్ఓ మలోలకు నాయకులు వినతిపత్రం అందించారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి, నాయకులు రమణ, టి.నారాయణస్వామి, రామకృష్ణ, మర్రిస్వామి పాల్గొన్నారు.

16న యూటీఎఫ్ రణభేరి ప్రచార జాతా

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) తలపెట్టిన రణభేరి ప్రచారజాతాను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలో ప్రచారజాతా పోస్టర్లను ఆవిష్కరించారు. గేయానంద్ మాట్లాడుతూ ఈనెల 15న కర్నూలులో ప్రారంభమయ్యే ప్రచారజాతా 16న గుంతకల్లు ప్రాంతంలోకి ప్రవేశించి, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం మీదుగా అనంతపురం చేరుకొని కళ్యాణదుర్గం బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ సాగుతుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, మోడల్ స్కూల్ శివానంద, నాయకులు మహమ్మద్ జిలాన్, కోటేశ్వరప్ప, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

బాలుడిని తండ్రికి అప్పగింత

అనంతపురం: నగరంలో ఆదివారం ఉదయం తప్పిపోయిన బాలుడిని మూడో పట్టణ పోలీసులు తండ్రికి అప్పగించారు. నారాయణపురం పంచాయతీలోని ప్రహ్లాదనగర్‌కు చెందిన రమేష్‌బాబు కుమారుడు బచ్చలి ఈక్షిత్ ఫణీంద్ర నాలుగో రోడ్డుకు చెందిన బ్రాహ్మణ వసతి గృహంలో ఉంటూ నీలిమ థియేటర్ వద్దనున్న నారాయణ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం 8 గంటలకు హాస్టల్ నుంచి స్కూల్‌కు వెళ్తున్నానని చెప్పి కనిపించకపోవడంతో తండ్రి రమేష్ బాబు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తిరుపతిలో ఉన్న బాలుడిని అనంతపురానికి తీసుకొచ్చారు.

బయోమైనింగ్ పనుల పరిశీలన



కంపోస్టు యార్డులో బయోమైనింగ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

అనంతపురం కార్పొరేషన్: గుత్తి రోడ్డు కంపోస్టు యార్డులో జరుగుతున్న బయో మైనింగ్ పనులను మంత్రి నారాయణ సోమవారం పరిశీలించారు. రోజుకి ఎంత చెత్త తరలిస్తున్నారు.. ఇప్పటి వరకు ఎంత పూర్తయ్యిందని అధికారులతో మంత్రి ఆరా తీశారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ నిన్నటి వరకు 78 వేల టన్నుల చెత్తను క్లియర్ చేశారని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెత్తను తరలించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ రాజశేఖర్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామమోహన్ రెడ్డి, తదితరులున్నారు.

సీఎంకు సీమ కరువు కనిపించదా?



మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి వేమన

అనంతపురం అర్బన్: నా కలల రాజధాని అంటూ అమరావతిపై ప్రేమ చూపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాయలసీమ కరువు, ఇక్కడి ప్రజలు కష్టాలు పట్టవా? అని సీపీఎం ఎంఎల్ లిబరేషన్ నాయకులు ప్రశ్నించారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 10న జరగనున్న సూపర్ హిట్ సభలో సీమ ప్రాంతంలోని రైతులు, నిరుద్యోగులు, కరువుపై ముఖ్యమంత్రి స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీమకు అన్నీ చేశామని, హంద్రీనీవా, గాలేరి–నగరి ప్రాజెక్టులకు నీరు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా గౌరవాధ్యక్షుడు వలి, నాయకులు పరిశురాముడు, వెంకటేష్, భీమేష్, రామప్ప పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమ ద్రోహి చంద్రబాబు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థి ఉద్యమాలతో రాజకీయ ఆరంగేట్రం చేసిన సీఎం చంద్రబాబు.. అధికారంలోకొచ్చాక విద్యార్థి ఉద్యమాలు అణిచివేసేలా ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్బీ) జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ మండిపడ్డారు. సోమవారం స్థానిక టవర్‌క్లాక్ వద్దనున్న గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండు నెలల క్రితం ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న వ్యవహారాలు బయటకు రాకుండా ఉండేందుకు పరోక్షంగా విద్యార్థి నాయకులను విద్యాసంస్థల్లోకి అనుమతించకూడదని ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్బీ నాయకులు నరేష్, మనోజ్ సందీప్, ఈశ్వర్, విజయ్ పాల్గొన్నారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: బసంపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చంద్రశేఖర్ అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సానే రాజారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని బి.యాలేరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కె.ఈశ్వరరెడ్డి సతీమణి లక్ష్మీదేవి అనారోగ్యంగా ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

వేళంగణి మాత జన్మదినం

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు గ్రామంలో క్రైస్తవులు వేళంగణి మాత పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మొదట చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి గీతాలను ఆలపించారు. అనంతరం వేళాంగణి మాత స్వరూపాన్ని గ్రామోత్సవం నిర్వహించారు.

ఇదేమి 'పచ్చని' పైశాచికత్వం !



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కూటమి జెండాల అలంకరణ



రాజీవ్ గాంధీ విగ్రహం కనిపించకుండా ...

పచ్చకామెర్లు ఉన్న వ్యక్తికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది అనే నానుడిని అచ్చంగా 'పచ్చ'నేతలు నిజం చేస్తున్నారు. ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోగా.. 'సూపర్‌సిక్స్.. సూపర్ హిట్' పేరిట ఈనెల 10న నిర్వహించే సీఎం చంద్రబాబు సభ కోసం నగరమంతా పచ్చగా మార్చారు. రోడ్లు, రహదారులు, వీధులు ఎక్కడ చూసినా పచ్చని తోరణాలు కట్టారు. కనీసం మహనీయుల విగ్రహాలనూ వదలలేదు. ఇదేమి పచ్చని పైశాచికత్వమంటూ నగర ప్రజలు ఈసడించుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్స్, అనంతపురం:



మదర్ థెరిస్సా విగ్రహానికి ..



జెడ్పీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ చుట్టూ కప్పేసిన జెండాలు



తెలుగుతల్లి విగ్రహం చుట్టూ పచ్చని తోరణాలు



నీలం సంజీవరెడ్డి, అమరవీరుల స్థూపం వద్ద ఇలా..